క్లుప్తంగా

నటరాజన్ పాదయాత్రకు తరలిరావాలి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



డొంకేశ్వర్/ నందిపేట్: ఆర్మూర్‌లో ఈ నెల 2న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నిర్వహించే పాదయాత్రకు కాంగ్రెస్ శ్రేణులంతా తరలిరావాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి కోరారు. గురువారం డొంకేశ్వర్, నందిపేట్ మండల కేంద్రాల్లో బూత్‌స్థాయి, గ్రామస్థాయి అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రతి బూత్ నుంచి పది మందిని పాదయాత్రకు తీసుకువచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమాల్లో డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు గొడిసెరం భూమేశ్ రెడ్డి, లిఫ్టుల కమిటీ చైర్మన్ భోజారెడ్డి, నాయకులు గంగారెడ్డి, సుమన్ నాయక్, స్రవంతి, నందిపేట్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్, నాయకులు పిప్పెర సాయారెడ్డి, బైండ్ల ప్రశాంత్, దూడ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన గగ్గుపల్లి ప్రశాంత్ కుటుంబ సభ్యులకు రూ. లక్షా యాభైవేల ఎల్‌వోసీని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం అందజేశారు. ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. ప్రశాంత్ పరిస్థితిని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎల్‌వోసీ మంజూరు చేయించారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

బాల్కొండ: రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని బాల్కొండ ఎస్సై శైలెందర్ సూచించారు. గురువారం బాల్కొండ మండల పరిధిలో వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. రైతులు పోలీసులతో సహకరించాలని కోరారు. రైతులు, సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

బాల్కొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించారు. కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని అన్నారు. సమావేశంలో క్యాతం నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం..

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ముప్కాల్ ఎంఈవో జక్కుల రవికుమార్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. వంటగది, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌వో వినోద, ఉపాధ్యాయులు ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

పెర్కిట్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని పిప్రి హెచ్‌ఎం విశ్వనాథ్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల సముదాయ సమావేశం నిర్వహించారు. విద్యార్థులను భావి భారత శాస్త్రవేత్తలుగా తయారు చేసే గురుతర బాధ్యత భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులపై ఉందని హెచ్‌ఎం అన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్స్ పోచన్న, ఆనంద్, రంజిత్ భౌతిక శాస్త్రంలో వచ్చిన మార్పులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఉమ్మడి ఆర్మూర్, బాల్కొండ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని చావిడిగల్లికి చెందిన కర్నె భిశ్వజిత్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి కర్ణాటక బెల్గావ్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. ఏప్రిల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో 300 మార్కులకు 254 మార్కులు సాధించాడు. అనంతరం భిశ్వజిత్‌ను ఎంఈవో నాదెండ్ల శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు.

నాయకుల ముందస్తు అరెస్టు

బోధన్: రాష్ట్ర మంతివర్గంలో లంబాడ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడల జనాభాను నిష్పక్షపాతంగా బహిర్గతం చేయాలని డిమాండ్‌తో లంబాడ హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం గురువారం గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో తెల్లవారు జామున పట్టణ కేంద్రంలోని జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ ప్రవీణ్ నాయక్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దూప్ సింగ్‌లతో పాటు పలువురు నాయకులను ముందస్తు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణమెప్పుడో?

- ఇబ్బంది పడుతున్న వేల్పూర్, పడగల్ గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



వేల్పూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించాల్సిన స్థలం



పడగల్‌లో పిల్లర్లస్థాయిలో ఆగిపోయిన ఆరోగ్య ఉపకేంద్రం

వేల్పూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. వేల్పూర్ మండలంలోని వేల్పూర్, పడగల్ గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు ఆగిపోయాయి. వేల్పూర్‌లో శంకుస్థాపన చేసి రెండేళ్లవుతున్నా పనులు మొదలు కాలేదు. పడగల్‌లో పిల్లర్లస్థాయిలోనే నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వేల్పూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరడంతో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా రూ. 20 లక్షలు మంజూరు చేయించి 2023సెప్టెంబరు30న భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికలు రావడంతో పనులు ముందుకు సాగలేదు. ఇటీవల పనులు ప్రారంభించాలని స్థలాన్ని చదును చేయించారు. ఈ స్థలానికి వెనుక భాగంలో గ్రంథాలయం ఉంటుంది. గ్రంథాలయానికి ఈ స్థలం కేటాయిస్తే పాఠకులకు, వాహనాల పార్కింగ్‌కు, లైబ్రరీకి రావడానికి అనుకూలంగా ఉంటుందని స్థలంకోసం జిల్లా గ్రంథాలయ సంస్థవారు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో టెండరు పూర్తయినా పనులు చేపట్టడం లేదని తెలుస్తోంది. సొంత భవనం లేక ఆరోగ్యకార్యకర్తలు తమ విధులను పక్కనే ఉన్న మహిళా సంఘం భవనంలో కొనసాగిస్తున్నారు. పడగల్‌లో చేపట్టిన ఆరోగ్య ఉపకేంద్రానికి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టరు పనులు చేయడం లేదని తెలుస్తోంది. దీంతో జీపీ భవనంలోని గదిలో ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

పనులు ప్రారంభించాలి



వేల్పూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి. సొంత భవనం లేక ఆరోగ్యకార్యకర్తలు ఇక్కట్ల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. పాత భవనం ఉన్న స్థలంలోనే నిర్మిస్తే మహిళలకు అందుబాటులో ఉంటుంది. ఇతర చోట నిర్మిస్తే చిన్న పిల్లల టీకాలకు ఇబ్బందిగా మారుతుంది.

– పిట్ల సత్యం, మాజీ ఉపసర్పంచ్, వేల్పూర్

నాటిన మొక్కలను సంరక్షించాలి



వనమహోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

మోర్తాడ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. భీమ్‌గల్ మండలం లింగాపూర్‌లో గురువారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటారు. ఐదెకారల విస్తీర్ణంలో నాటుతున్న ఈత మొక్కలను పరిశీలించారు. డీపీవో శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఎక్సైజ్ సీఐ గోవర్దన్, ఎంపీవో జావిద్ ఉన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

మోర్తాడ్: రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. గురువారం భీమ్‌గల్ పట్టణంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మందుల స్టాక్‌ను అడిగి తెలుసుకున్నారు. డీపీవో శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, వైద్యాధికారి అజయ్, ఎంపీవో జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

మోర్తాడ్: రేషన్‌కార్డుల జారీ, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, వైద్యాధికారి అజయ్, ఎంపీవో జావిద్, ఏఈలు విక్రమ్, అమూల్య, ఏపీవో నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం సేవలు ఆదర్శం



బాల్కొండ: ముప్కాల్ మండల ఏపీఎంగా విధులు నిర్వర్తించి జిల్లా సమాఖ్యకు బదిలీపై వెళ్తున్న ప్రసాద్‌రావు సేవలు ఆదర్శమని మండల సమాఖ్య వీవోలు, సీసీలు అన్నారు. గురువారం మండల సమాఖ్యలో ఏపీఎంను వారు ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన ఏపీఎం హిమబాలకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్: మహిళల అభ్యున్నతికి పాటుపడి వారిని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేసిన ఐకేపీ ఏపీఎం మాణిక్యంసేవలు అభినందనీయమని పలువురు అధికారులు అన్నారు. నందిపేట మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం ఐకేపీ ఏపీఎం మాణిక్యం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నందిపేట నుంచి వేల్పూర్ మండలానికి బదిలీపై వెళ్తున్న ఏపీఎం మాణిక్యంను నిర్మల్ జిల్లా డీఆర్డీవో నాగవర్ధన్, డీపీఎం మోహన్, స్త్రీనిధి ఆర్‌ఎం కిరణ్, నందిపేట ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సంతోష్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వీఓబీలు, సిబ్బంది, మహిళలు ఘనంగా సన్మానించారు.

కమ్మర్‌పల్లి: ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ సేవలు ఆదర్శప్రాయమని ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య, కమ్మర్‌పల్లి సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్‌కు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. సీసీలు రవి, నవీన్, శ్రీనివాస్, పీర్యా, భాగ్య, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సవాళ్ల చర్చ ఉద్రిక్తం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్‌ల మధ్య జరిగిన సవాళ్ల చర్చ ఉద్రిక్తతకు దారి తీసింది. మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ మండల కేంద్రంలో అక్రమంగా భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నట్లు సోషల్ మీడియాలో నాయకుడు సంతోష్ ఆరోపణలు చేస్తున్నాడంటు చర్చకు సిద్ధమంటూ మాజీ సర్పంచ్ బుధవారం సవాల్ విసిరాడు. దీంతో స్పందించిన నాయకుడు సంతోష్ అక్రమాలను నిరూపించేందుకు సిద్ధమంటూ చర్చకు అంబేడ్కర్ విగ్రహం వద్దకు రావాలనిపిలుపునిచ్చారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గురువారం ఉదయం నుంచి బందోబస్తు నిర్వహించారు. నాయకుడి సంతోష్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్ చర్చకు సిద్ధమంటూ జీపీ వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

ప్రజలకు వైద్య సేవలు అందించాలి

బోధన్‌రూరల్: పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం పెగడపల్లి గ్రామంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, వైద్యులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

రుద్రూర్: ఫర్టిలైజర్ షాపుల్లో కాలం చెల్లిన మందులు విక్రయిస్తే దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తామని కోటగిరి మండల వ్యవసాయాధికారి టి.రాజు హెచ్చరించారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం స్థానిక ఎస్సై సునీల్‌తో కలిసి ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

పీఎం కిసాన్ డబ్బులను జమ చేయాలి



వర్ని: పీఎం కిసాన్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం వర్ని మండల కేంద్రంలో రైతులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని రెండు నెలలు గడుస్తున్నా జమ చేయలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు చాలామంది రైతులకు జమ చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో రైతులు నర్సింగ్, వెంకట్, సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇంటింటికి వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8, 21వ వార్డుల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తే డంపింగ్ యార్డులో ఎరువుల తయారీకి ఉపయోగపడుతుందన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఇన్‌చార్జి శానిటరి ఎస్సై సురేశ్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లోని అసైన్‌మెంట్ భూమి సర్వేనంబర్ 202/3లో అక్రమంగా భూమి కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు బోరిగల ప్రశాంత్ కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు గుంటలకు చెందిన భూమిలో అక్రమార్కులు ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఈ విషయమై అధికారులకు విన్నవించినా స్పందన కరువైందన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. సమావేశంలో బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మాక్లూర్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ కళాబృందం సభ్యులు విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఎస్సై రమేశ్, ప్రిన్సిపాల్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారిణి

నందిపేట్: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడు పతకాలు సాధించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో అనాస్ బంగారు పతకం, శ్రీదీప్ వెండి పతకం, జ్యావెలిన్ త్రోలో అఖిల్ బ్రౌంజ్ పతకం సాధించాడు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ దేవన్న, డైరెక్టర్ వంశీ, పీఈటీ రంజిత్, హెచ్‌ఎం ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పెర్కిట్ కే జీబీవీ విద్యార్థినులు

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కేజీబీవీ విద్యార్థినులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రత్యేక అధికారిణి గంగామణి గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 29 నుంచి 30 వరకు నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్–16 లాంగ్ జంప్ పోటీల్లో పాఠశాలకు చెందిన అంజనీప్రియ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో పాటు అండర్–12 రన్నింగ్ పోటీల్లో సాత్విక సిల్వర్ మెడల్, అండర్–14 లాంగ్ జంప్‌లో సీహెచ్ నిత్యశ్రీ సిల్వర్ మెడల్, అండర్–18 లాంగ్ జంప్‌లో వై అను సిల్వర్ మెడల్‌తో పాటు 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. షార్ట్‌పుట్‌లో నందిని మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. మొత్తం ఏడు మెడల్స్ సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుచుకున్నట్లు ప్రత్యేకాధికారిణి తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పీఈటీ వీణతో పాటు విద్యార్థినిలను ఆమె అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీవిద్యాసాయి హైస్కూల్‌కు చెందిన తూమ్ సాయిచరణ్, బందెల సహర్య అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి తెలిపారు. ఈ నెల 3, 4వ తేదీల్లో హన్మకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం మంద శ్రీనివాస్, పీఈటీ విఠల్ పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి

- డీఈవో అశోక్‌కుమార్



హెచ్‌ఎం దంపతులను సన్మానిస్తున్న డీఈవో

రెంజల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు తప్పవని, పని చేస్తున్న ప్రదేశంలో ప్రజల మన్ననలు పొందడం వల్ల ఉద్యోగులకు చిరకాలం గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కుమార్ అన్నారు. రెంజల్ మండలంలోని నీలా హైస్కూల్ హెచ్‌ఎం ఇల్తెపు శంకర్ స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా గురువారం పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన డీఈవో మాట్లాడుతూ.. హెచ్‌ఎంగా శంకర్ అందించిన సేవలను వివరించారు. అనంతరం శంకర్ దంపతులను డీఈవో, పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమలింగంగౌడ్, కిశోర్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ముప్కాల్‌లో మాట్లాడుతున్న కనక ప్రమోద్

బాల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ డిమాండ్ చేశారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలో పింఛన్ లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ 2 వేలు ఉన్న పింఛన్ రూ. 4 వేలు చేస్తామన్నారన్నారు. కానీ అధికారంలోకివచ్చి ఏడాదిన్నర అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 5న ఆర్మూర్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నిర్వహించే సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గద్దల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి నాగుల రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్‌దారులతో సమావేశం

నందిపేట్ : మండలంలోని బజార్ కొత్తూర్, కౌల్‌పూర్, వెల్మల్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేయూత పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి మాట్లాడుతూ.. ఈ నెల 5న ఆర్మూర్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో చేయూత పింఛన్‌దారుల సన్నాహక గర్జన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాన్ని పింఛన్‌దారులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి శ్యామ్, సంతోష్, శక్కరి, కంఠం కాలి తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదల చేపట్టాలి



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి లక్ష్మికాలువ ద్వారా వెంటనే నీటి విడుదల చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు ఆశాజనకంగా ఉందన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన రైతులను ఆదుకోవడం కోసం వెంటనే లక్ష్మికాలువ ద్వారా నీటి విడుదల చేపట్టాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జైడి రవి, నాయకులు గోపినాథ్, వెంకట్‌నర్సయ్య, నర్సయ్య, జావిద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో పొలం బాట

పెర్కిట్: ఆలూర్ మండలం దేగాం సెక్షన్ పరిధిలోని రాంపూర్‌లో గురువారం విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ సత్య నారాయణ వినియోగదారులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. అలాగే అర్హులైన వ్యవసాయదారులకు కెపాసిటర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ సత్యనారాయణ, లైన్‌ఇన్‌స్పెక్టర్ ముజీబ్, లైన్‌మన్లు రమేశ్, అసిస్టెంట్ లైన్‌మన్లు లింబాద్రి, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

జన్నేపల్లిలో రైతులకు అవగాహన

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో ఏవో నవీన్ కుమార్ వరి పంట క్షేత్ర పరిశీలన చేశారు. రైతులకు పంటలపై తీసుకోవాల్సిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరిశీలనలో వరి పంటకు సోకిన ఉల్లికోడును గమనించారు. రైతులకు ఉల్లి కోడ్ లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బాల్కొండ/ కమ్మర్‌పల్లి: ముప్కాల్, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లో పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు రూ. లక్ష వారి ఖాతాల్లో జమ కావడంతో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సంక్షిప్తం

అంగన్‌వాడీ సరుకులు తరలిస్తుండగా పట్టివేత

బోధన్: ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాది కాలనీకి చెందిన అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన బియ్యం, పప్పులు, పాలు, బాలమృతం ప్యాకెట్లు సైకిల్‌పై తీసుకెళ్తుండగా స్థానికులు గురువారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమా తెలిపారు. సమాచారం మేరకు బోధన్ సీడీపీవో పద్మ అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో బియ్యం, ఇతర సరుకుల నిల్వను పరిశీలించారు. ఈ ఘటన పై పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని సీడీపీవో తెలిపారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల వితరణ

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు పాలెపు ముత్తెన్న రూ. 13,500తో చేయించిన ఐడెంటిటీ కార్డులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనక గంగాధర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, వీడీసీ అధ్యక్షుడు తోపారం శివానంద్, కార్యదర్శి నేల హరీశ్, సభ్యులు బైకాని ముఖేశ్, మహేశ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

నవీపేట: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీజేపీ మండల అధ్యక్షుడు ద్యాగ సరిన్ సూచించారు. మండలంలోని నవీపేట, నాళేశ్వర్, బినోల, లింగాపూర్, నిజాంపూర్, జన్నెపల్లి, అబ్బాపూర్(ఎం), మోకన్‌పల్లి, పోతంగల్ గ్రామాల్లో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమాల్లో నాయకులు రాజేందర్‌గౌడ్, భూషణ్, ఆనంద్, రాధ, రామకృష్ణ, నాగభూషణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం

బోధన్: ఎడపల్లి మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి పై గురువారం స్థానిక ఎంపీడీవో ఆఫీస్‌లో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, జీపీ కార్యదర్శులతో మండల ప్రత్యేక అధికారి రవికుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శంకర్, ఎంపీవో మన్మోహన్ శాస్త్రీ, మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్, ఈజీఎస్ ఏపీవో శ్రీవాణి, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

బోధన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని బోధన్ సీడీపీవో పద్మ అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశించారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రం, జానకంపేటలో నిర్వహించిన సెక్టార్ స్థాయి అంగన్‌వాడీ టీచర్లతో నెలవారీ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు విజయరాణి, సావిత్రి పాల్గొన్నారు.

ఘనంగా ప్రేమ్‌చంద్ జయంతి

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో హిందీ నవల రచయిత ప్రేమ్‌చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.